



జమ్మికుంట మున్సిపల్ కార్యాలయం

జమ్మికుంట మున్సిపల్ అవిశ్వాసంపై ఉత్కంఠ

- హైదరాబాద్‌లో పోటా పోటీ క్యాంపులు

జమ్మికుంట రూరల్, జనవరి2: జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావుపై అవిశ్వాస తీర్మాన నోటీస్ ఇచ్చిన నాటి నుంచి జమ్మికుంట రాజకీయం రోజుకో మలుపు తిరుగుతోంది. ముప్పై మంది కౌన్సిలర్లు ఉన్న మున్సిపాల్టీలో ఇరువై మంది సంతకాలతో అవిశ్వాసం తీర్మానం కాపీని గత నెల 29న డీఆర్‌వో పవన్‌కుమార్‌కు అందజేశారు. అప్పటి నుంచి క్యాంపు రాజకీయాలు కొనసాగుతున్నాయి. చైర్మన్‌కు వ్యతిరేకంగా ఇరువై మంది కౌన్సిలర్లు సంతకాలు చేసినట్లు తెలుసు కున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి రంగంలోకి దిగారు. గత నెల 28రాత్రి కౌన్సిలర్ల ఇళ్లకు వెళ్లి తాము రాజేశ్వర్ రావుకు మద్దతు పలుకుతున్నట్లు కౌన్సిలర్లతో సంతకాలు చేయించుకున్నారు. చైర్మన్‌తో పాటు కౌన్సిలర్లను వెంట తీసుకువెళ్లి అవిశ్వాస తీర్మానాన్ని అంగీకరంచవద్దని విజ్ఞప్తి చేశారు. అవిశ్వాస తీర్మాణాన్ని డీఆర్వోకు అందజేసిన అనంతరం 23వ వార్డు కౌన్సిలర్ పొనగంటి మల్లయ్య నేతృత్వంలో హైదరాబాద్ క్యాంపునకు తరలివెళ్లారు. అనంతరం మరుసటి రోజు చైర్మన్ తన మద్దతు దారులతో కలిసి క్యాంపులో ఉన్న కౌన్సిలర్ల దగ్గరకు వెళ్లగా కొంత ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. దీంతో రాజేశ్వర్‌రావు సైతం తన అనచరులతో హైదరాబాద్‌లోని మరోచోట క్యాంపు నిర్వహిస్తున్నారు. పొనగంటి మల్లయ్య క్యాంపులో 16మంది, రాజేశ్వర్‌రావు క్యాంపులో 14మంది ఉన్నట్లు తెలిసింది. ముందుగా పొనగంటి మల్లయ్య వెంట వెళ్లి సంతకాలు చేసిన కౌన్సి లర్లలో కొందరు తిరిగి రాజేశ్వర్‌రావు వెంట వెళ్లి ఆయనకు మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. మల్లయ్య క్యాంపులో ఉన్న ఒకరిద్దరు కౌన్సిలర్లు క్యాంపును వీడినట్లు సమాచారం. ఎవరి క్యాంపులో ఎంత మంది కౌన్సిలర్లు ఉన్నారు, ఎవరు, ఎవరికి మద్దతు తెలుపుతారో అనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. కౌన్సిలర్లు క్యాంపులో కొనసాగుతుండగా జమ్మికుంట మున్సిపాలిటీలో ఎప్పుడు ఏం జరుగుతుందో అనే చర్చ నడుస్తోంది.

ప్రజాపాలన దరఖాస్తులు డిజిటలైజ్ చేయాలి

- రేషన్ కార్డు కోసం దరఖాస్తు తీసుకోవాలి
- కలెక్టర్ పమేలా సత్పతి

మానకొండూర్, జనవరి 2: ప్రజాపాలన దరఖాస్తులను డిజిటలైజ్ చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులకు సూచించారు. మండలంలోని కెల్లేడు, లలితాపూర్, జగ్గయ్యపల్లి, ఖాదర్‌గూడెం గ్రామాలలో మంగళవారం ప్రజాపాలన గ్రామ సదస్సులు జరిగాయి. కెల్లేడు గ్రామంలో జరిగిన సదస్సును కలెక్టర్ సందర్శించి దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన గ్రామ సదస్సులలో స్వీకరించిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు డిజిటలైజ్ చేయాలని ఆదేశించారు. పథకాలతో పాటు వచ్చే ఇతర దరఖాస్తులతో పాటు రేషన్ కార్డు కోసం దరఖాస్తులను కూడా స్వీకరించాలని సూచించారు. దరఖాస్తుదారులు అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నట్లయితే అలాంటి వారు సమర్పించే దరఖాస్తులపై అద్దె ఇంటిదారు అని నమోదు చేయాలన్నారు. అనంతరం గ్రామ సదస్సులలో ఏర్పాటు చేసిన కౌంటర్ల వారీగా వచ్చిన దరఖాస్తుల వివరాలతో సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కెల్లేడులో 552, జగ్గయ్యపల్లిలో 365, లలితాపూర్‌లో 316, ఖాదర్‌గూడెంలో 326 మొత్తం 1,559 దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాజు, ఎంపీడీవో రాజేశ్వర్‌రావు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కెల్లేడులో ప్రజాపాలన దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్

- ప్రజా పాలనకు దరఖాస్తుల వెల్లువ
- కొత్త రేషన్ కార్డులు, 'చేయూత'కు పెరిగిన అర్జీలు



కరీంనగర్ లో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

గడువు మూడు రోజులే

కరీంనగర్ టౌన్, జనవరి 2: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఆరు గ్యారెంటీలను అమలు చేసేందుకు స్వీక రిస్తున్న దరఖాస్తుల గడువు సమీపిస్తుం డడంతో జనం బారులు తీరుతున్నారు. డిసెంబర్ 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు ఆరు గ్యారెంటీలకోసం దరఖాస్తుల స్వీకరణ చేపడుతుండడంతో నగరాలు, పట్టణాల్లోనే మొదట స్పందన కనిపించింది. దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియ అంటూ ప్రభుత్వం ప్రకటించడంతో ప్రజా పాలన సభలకు స్పందన అంతగా కనిపించలేదు. అయితే దరఖాస్తుల స్వీకరణ గడువు ఈ నెల 6తో ముగియనుండడంతో ఆ తర్వాత దరఖాస్తులను స్వీకరిస్తారో లేదోనన్న అనుమానాలతో మంగళవారం ప్రజాపాలన సభల వద్ద బారులు తీరి దరఖాస్తులు సమర్పించారు. జిల్లాలో కరీంనగర్, మానకొండూర్, హుజురాబాద్, చొప్పదండి అసెంబ్లీ నియోజక వర్గాలకు ప్రత్యేక అధికారులను, మండలాలకు ప్రత్యేక అధికారులను నియమించారు. కరీంనగర్ నగరపాలక సంస్థతోపాటు హుజురాబాద్, జమ్మికుంట, కొత్తపల్లి, చొప్పదండి మున్సిపాలిటీలు, 16 మండలాలోని 313 గ్రామ పంచాయతీ వీటి పరిధిలో 170 బృందాల ద్వారా 146 వార్డులలో ప్రజా పాలన కార్యక్రమాలను నిర్వహించి ప్రజ లకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి గ్రామం, మున్సిపాలిటీల్లో ప్రతి వార్డులు, కార్పొరేషన్‌లో ప్రతి డివిజన్‌లో ఎక్కడికక్కడ ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించేందుకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి ఒక్కో కేంద్రంలో ఐదు కౌంటర్ల ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండు షెడ్యూల్లో గ్రామసభ నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరి స్తున్నారు. అలాగే అవసరమైన వారికి అక్కడే దరఖాస్తు ఫారాలను కూడా ఉచితంగా అందజేస్తున్నారు.

దరఖాస్తుదారు ఫొటో, ఆధారుకార్డు, రేషన్‌కార్డు, ఫోన్‌నెంబర్, కుటుంబసభ్యుల ఆధార్ నెంబర్లు, గ్యాస్ కనెక్షన్ నెంబర్, గ్యాస్ ఏజెన్సీ పేరు, పట్టాదారుపుస్తకం నెంబర్, సర్వే సంఖ్య, విస్తీర్ణం, వ్యవసాయ కూలీ అయితే జాబ్ కార్డు నెంబర్, గృహ విద్యుత్ మీటర్ కనెక్షన్ నెంబర్, దివ్యాంగులైతే సదరం సర్టిఫికెట్‌లను జతచేస్తూ దరఖాస్తు చేసుకోవాలి. మహాలక్ష్మి, రైతుభరోసా, ఇందిరమ్మ ఇల్లు, గృహజ్యోతి, చేయూత పథకం కోసం ముందుగా దరఖాస్తుల ను స్వీకరించే విధంగా దరఖాస్తు నమూనాను తయారు చేశారు. అయితే రేషన్‌కార్డు కోసం ఈ దరఖాస్తు ఫారంలో అంశం చేర్చకపోవడంతో అనేక మంది రేషన్‌కార్డు దరఖాస్తులను జతచేసి ఇస్తున్నారు.

జిల్లాలో నాలుగు కరోనా పాజిటివ్

సుభాష్‌నగర్, జనవరి 2: కరీంనగర్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం ఆర్‌టిపిసీఆర్ పరీక్షలు నిర్వహించగా నాలుగు కరోనా పాజిటివ్ కేసులు నమోదైనట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి. వీరారెడ్డి తెలిపారు. రేకుర్తికి చెందిన తల్లితో పాటు 18నెలల బాబు కు, అదే గ్రామానికి చెందిన మరో మహిళకు, చిగురు మామిడికి చెందిన యువతికి పాజిటివ్‌గా తేలింది. నలుగురికి సాధారణ లక్షణా లు ఉన్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఒమిక్రాన్ సబ్ వేరియంట్ సబ్ వేరియంట్ జేఎన్1 విస్తరించడంతో ప్రజలు కరోనా నిబంధనలు పాటించాలని డాక్టర్లు సూచిస్తున్నారు.

పెట్రోల్ కోసం ఎగబడ్డ జనం

- పెట్రోల్ అమ్మకాలపై ట్రాన్స్‌పోర్టు సమ్మె ప్రభావం
- బంకుల్లో నోస్టాక్ బోర్డులు
- బారులు తీరిన వాహనదారులు



కరీంనగర్‌లో వాహనాలతో రద్దీగా మారిన పెట్రోల్ పంపు

కరీంనగర్ టౌన్, జనవరి 2: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మోటారు వాహనాల చట్ట సవరణతో దేశవ్యాప్తంగా లారీ డ్రైవర్లు చేపట్టిన సమ్మె ప్రభావం పెట్రోల్ బంకులపై పడింది. రెండురోజుల నుంచి ఆయిల్ ట్యాంక ర్లను ఎక్కడికక్కడే నిలిపివేయడంతో చాలా బంకుల్లో పెట్రోల్, డీజిల్ అయిపోవడంతో నో స్టాక్ బోర్డులు ఏర్పాటు చేశారు. దీనికితోడు పెట్రోల్, డీజిల్ కొరత కారణంగా బంకులు మూసివే స్తారంటూ సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొట్టడంతో వాహనదారులు పెట్రోల్, డీజిల్ పోసుకునేందుకు పోటీపడ్డారు. స్టాక్ ఉన్న బంకుల వద్దనే కాకుండా నో స్టాక్ బోర్డులు ఏర్పాటు చేసిన బంకుల వద్ద కూడా స్టాక్ వస్తుందంటూ బంక్ యజమానులు, సిబ్బంది తెలుపడంతో చాలా మంది వాహనదారులు గంటల తరబడి పడిగాపులు కాసారు. కొన్ని చోట్ల బంకుల్లో పెట్రోల్, డీజిల్ ఉన్నప్పటికీ వాటిని విక్రయించకుండా నోస్టాక్ బోర్డులు ఏర్పాటు చేశారంటూ వాహనదారులు బంక్ యజమానులు, సిబ్బంది తో గొడవకు దిగడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసులు బంక్‌ల వద్ద బందోబస్తు ఏర్పాటు చేసి ఘర్షణలు జరుగకుండా చర్యలు చేపట్టారు. మరోవైపు పెట్రోల్, డీజిల్ ట్యాంకర్ల డ్రైవర్లు ధర్నా విరమించారని, పెట్రోల్ బంకులకు త్వరలోనే పెట్రోల్, డీజిల్ వస్తుందని ఆందోళన చెందవద్దంటూ పోలీసులు, అధికారులు స్పష్టంగా ప్రకటించినప్పటికీ వాహనదారులు రాత్రి 10 గంటల వరకు కూడా బారులు తీరడంతో బంకులన్నీ కిక్కిరిసి పోయాయి. జిల్లా కేంద్రంతోపాటు హుజురాబాద్, జమ్మికుంట, చొప్పదండి, కొత్తపల్లి మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లోని బంకుల్లో సైతం వాహనదారులు పెట్రోల్, డీజిల్ పోయించుకునేందుకు పోటీపడ్డారు.

జమ్మికుంట: పట్టణంలోని పెట్రోల్ బంక్‌లు మంగళవారం కిక్కిరిసాయి. పలు పెట్రోల్ బంక్‌ల యాజమానులు నోస్టాక్ బోర్డు పెట్టగా, మరి కొన్ని బంకుల్లో గంటల కొద్ది క్యూ లైన్లో నిల్చొని తమ వాహనాల్లో పెట్రోల్ పోసుకున్నారు.

మానకొండూర్ : మండలంలోని గట్టుదుద్దెనపల్లి, చెంజర్ల, ఈదులగట్టెపల్లి, మానకొండూర్, అన్నారం, పచ్చునూరు, లక్ష్మీపూర్ గ్రామాలలోని పెట్రోల్ బంకుల వద్ద మంగళవారం రాత్రి పెట్రోల్ కోసం ద్విచక్ర వాహనాలతో పాటు లారీలు, ఆటోలు బారులు తీరాయి. బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు పెట్టారు. వాహనదారులు పెట్రోల్ కోసం బంకుల వద్ద బారులు తీరారు.

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలోని పెట్రోల్ బంక్‌ల్లో మంగళవారం రాత్రి వాహన దారులు బారులు తీరారు. ఒక్కసారిగా వాహనదారులు రావడంతో పెట్రోల్ బంక్ యాజమాన్యానికి, వాహనదారుల మధ్య ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. కొన్నిచోట్ల పెట్రోల్ బంక్ సిబ్బంది పెట్రోల్ పోయడం నిలిపివేశారు.

ఇల్లందకుంట: మండలంలో బంక్‌ల వద్ద రద్దీ పెరిగింది. కొద్దీ గంటలు వాహనదారులు లైన్లు కట్టారు. ప్రభుత్వం వెంటనే ఆయిల్ ట్యాంకర్ల యజమానులు, డ్రైవర్లతో చర్చలు జరపడంతో డ్రైవర్లు ధర్నా విరమించినట్లు అధికారులు తెలిపారు. పెట్రోల్ కొరత లేదని, ఆయిల్ ట్యాంకర్లు వస్తున్నాయని బంకు యజమానులు చెప్పారు.

- ట్యాంకర్ల ధర్నా ఉపసంహరణతో ఊరట

కేంద్ర ప్రభుత్వం కొత్తగా అమలులోకి తెచ్చిన మోటారు వాహన చట్ట సవరణతో దేశవ్యాప్తంగా డ్రైవర్లు ఆందోళనకు దిగడంతో పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడింది. మంగళవారం రాత్రి వరకు ట్యా ంకర్లు ధర్నా విరమించడంతో పెట్రోల్ బంకులకు ట్యాంకర్ల ద్వారా పెట్రోల్, డీజిల్ సరఫరా చేశారు. దీనితో వాహనదారులకు ఊరట లభించింది. బుధవారం నుంచి యధావిధిగా పెట్రోల్ సరఫరా అవుతుందని, ఆందోళన చెందవద్దని అధికారులు, పోలీసులు, మరోవైపు ట్రాన్స్‌పోర్టు యజమానుల సంఘం కూడా ప్రకటించింది.



హుజూరాబాద్‌లోని పెట్రోల్ బంక్‌ల్లో బారులు తీరిన వాహనదారులు

బీఆర్‌ఎస్‌ను కూకటి వేళ్లతో పెకిలించాలి

- కష్టపడ్డ వారికే స్థానిక టికెట్లు
- త్వరలో 20 వేల మందితో క్షేత్రస్థాయి కార్యకర్తల సమ్మేళనం
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్, జనవరి 2(ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): బీఆర్ఎస్ పార్టీని కూకటివేళ్లతో పెకిలించాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం నగరంలోని శుభమంగళ గార్డెన్స్‌లో బీజేపీ మండలాధ్యక్షులు, మండల ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కష్టపడ్డ వారికే స్థానిక సంస్థల టికెట్లు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో బీజేపీని గెలిపించా లన్నారు. తప్పుడు ప్రచారాలు నమ్మవద్దని, విషప్రచారం చేసే వారి సంగతి పార్టీ చూసుకుంటుందన్నారు. త్వరలో 20 వేల మందితో క్షేత్రస్థాయి కార్యకర్తల సమ్మేళనం నిర్వహిస్తామన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీకి ఇంత క్యాడర్ లేదని అయినా 90వేల మెజారిటీతో బీజేపీని గెలిపించారన్నారు. ఈసారి క్యాడర్ పెరిగిందని, రెట్టింపు మెజారిటీతో పార్టీ అభ్యర్థిని గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎన్నికల్లో మండల అధ్యక్షులు, ఇన్‌ఛార్జీలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎంపీ ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన వారికి, మెరుగైన ఫలితాలు తెచ్చిన వాళ్లకు స్థానిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు టికెట్లు కేటాయిస్తామన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లుగా పోటీ చేసే అవకాశం కల్పిస్తామన్నారు. పార్టీలో ఉంటూ ఒకరిద్దరు నాయకులు పార్టీకి నష్టం చేస్తున్నారనే విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. పార్టీకి ద్రోహం చేసే వారి పరిస్థితి అధిష్టానం చూసుకుంటుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా తయారైందన్నారు. ఉద్యోగులకు జీతాలివ్వడానికే డబ్బులేదని, ఇక హామీలు అమలు మాట దేవుడెరుగన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్సెస్ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ నినాదంతో జరుగనున్నాయన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ వర్సెస్ కాంగ్రెస్ మధ్యే పోటీ ఉంటుందన్నారు. బీఆర్ఎస్ 3వ స్థానానికి పడిపోవడం ఖాయమన్నారు. బీఆర్ఎస్‌కు ఓట్లేస్తే డ్రైనేజీలో వేసినట్లే అన్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల్లో యాభై శాతానికి పైగా ఓట్లు సాధించడమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలన్నారు. బండి సంజయ్ ఈ సారి గెలిస్తే కేంద్ర మంత్రి అయ్యే అవకాశాలు న్నాయన్నారు. బీజేపీకి గ్రామాల్లోనూ అనుకూల పవనాలు వీస్తున్నాయన్నారు. కరీంనగర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి ఎవరో తేల్చుకోలేని పరిస్థితి ఉందన్నారు. బీఆర్ఎస్‌కు అభ్యర్థి ఉన్నా ఆ పార్టీకి ఓటు వేయడం దండుగ అనే భావనతో ప్రజలు ఉన్నారన్నారు. కేసీఆర్‌ను గద్దె దించడంలో బండి సంజయ్ చేసిన కృషి అమోఘమన్నారు. కార్యకర్తలంతా ఇంటింటికి వెళ్లి బీజేపీకి ఓటేయాలని కోరాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ అధికార ప్రతినిధి సిహెచ్ విఠల్, కార్యదర్శి బొమ్మ జయశ్రీ, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల ఇన్‌ఛార్జిలు మీసాల చంద్రయ్య, మోహన్‌రెడ్డి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, ప్రతాప రామక్రిష్ణ, పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.









ఎన్నికల సందర్భంగా ఇంటలిజెన్స్ కమిటీ ఏర్పాటు

● కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాబోయే పార్లమెంట్ సాధారణ ఎన్నికల నేపథ్యంలో గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో చేసిన ఖర్చు, డబ్బు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీ పట్టివేతకు సంబంధించిన సమాచారం ఆధారంగా ప్రాథమిక నివేదిక సమర్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి అధికారులకు సూచించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని ఎన్నికల వ్యయ సున్నితమైన నియోజకవర్గాలు, ప్రాంతాలను గుర్తించుటకు మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి ఇంటలిజెన్స్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెకటర్ మాట్లాడుతూ ఈ జిల్లా స్థాయి కమిటీలో జిల్లా రెవెన్యూ శాఖతో పాటు సభ్యులుగా ఉండి గత అసెంబ్లీ, పార్లమెంటరీ ఎన్నికల సమయంలో ఖర్చు చేసిన డబ్బు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీ పట్టివేతల సమాచారం ఆధారంగా ప్రాథమిక నివేదిక ఏర్పాటు చేయాలన్నారు. నివేదిక ఆధారంగానే జిల్లాలోని సున్నితమైన వ్యయ అసెంబ్లీ నియోజకవర్గాలు, ప్రాంతాలను ఎన్నికల సంఘం గుర్తించి తదనుగుణంగానే, వాటిని ప్రత్యేకంగా పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, డీఆర్‌వో పవన్ కుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ పి శ్రీనివాసరావు, ఏసీపీ పి కిష్టయ్య, ఇన్‌కంటాక్స్ అధికారి ఆర్ రాజేష్, జీఎస్టీ అధికారి వి మధునయ్య, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఆంజనేయులు, ఎలక్షన్ డీటీలు, అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

ఎస్‌యూ ఎంఈడీ పరీక్ష ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, జనవరి 2: ఎస్‌యూ పరిధిలోని ఎంఈడీ రెండో సెమిస్టర్, బీ ఫార్మసీ మొదటి, రెండు, మూడు, నాలుగో సెమిస్టర్ ఫలితాలను విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్.వీ.శ్రీరంగప్రసాద్ తెలిపారు. ఫలితాలను యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని తెలిపారు.

'కరీంనగర్-హసన్‌పర్తి రైల్వేలైన్ పనులు త్వరలో ప్రారంభం'

భగత్‌నగర్, జనవరి 2: కరీంనగర్-హసన్‌పర్తి రైల్వే లైన్ పనులు త్వరలో ప్రారంభమవుతాయని బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం నగరంలోని పద్మశాలి భవన్‌లో సంఘం కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్ అభివృద్ధి కోసం పెద్ద ఎత్తున నిధులు తీసుకు వచ్చానన్నారు. ప్రజల కోరిక మేరకు కరీంనగర్-హసన్‌పర్తి కొత్త రైల్వే లైన్‌కు సంబంధించిన సర్వే పనులు పూర్తి కాబోతున్నాయన్నారు. ఒక వర్గం ఓట్ల కోసం పాకులాడితే 2014, 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచేవాడినన్నారు. తనకు ధర్మమే ముఖ్యమని, హిందు ధర్మ రక్షణ కోసం ఎంతవరకైనా వెళతా.. కానీ ఓట్లకోసం పాకులాడేది లేదన్నారు. రాష్ట్రంలో కుల వృత్తులు,కుల సంఘాల అభ్యున్నతికి పైసలిచ్చేందుకు వెనుకాడే రాష్ట్ర ప్రభుత్వం ఉగ్రవాదులను పెంచిపోషిస్తున్న, మత మార్పిడులను ప్రోత్సహిస్తున్న తబ్లిగ్‌జమాతే వంటి సంస్థలు నిర్వహించే సభలు సమావేశాలకు రూ.3 కోట్ల రూపాయల నిధులు కేటాయించడం సిగ్గుచేటన్నారు. ఇకనైనా హిందుసమాజం సంఘటితం కావాల్సిన అవసరం ఉందన్నారు. దేశం సురక్షితంగా ఉండాలంటే ప్రజలకు ఉపయోగపడే చట్టాలు కార్యరూపం దాల్చాలంటే బీజేపీ గెలుపు అనివార్యమన్నారు. భారత పౌరులంతా దేశంలో ఎక్కడికైనా వెళ్లి స్థలం కొనుక్కొని ఇల్లుకట్టుకుని నివసించే అవకాశం ఉంటుందని, వివాహాలు చేసుకునే అవకాశం ఉందని, కశ్మీర్‌లో మాత్రం అవకాశం లేకుండా కాంగ్రెస్ పాలకులు చేశారన్నారు.














బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



బోనంతో బారులుదీరిన భక్తులు

వేములవాడ, జనవరి 2: రాజరాజేశ్వరస్వామి వారి అనుబంధ దేవాలయమైన బద్ది పోచమ్మ ఆలయం మంగళవారం నాడు భక్తులతో రద్దీగా మారింది. సోమవారం నాడు తమ ఇష్టదైవమైన శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆనవాయితీ ప్రకారం మంగళవారం నాడు బద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు తెల్లవారుజామునే భక్తిశ్రద్ధలతో నైవేద్యం వండి బోనం తయారుచేసి ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకొని బద్ది పోచమ్మ అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.

రాజన్న ఆలయానికి అదనపు భద్రత

- 11 మంది ఎస్పీఎఫ్ సిబ్బంది కేటాయింపు - మహాశివరాత్రి వరకు విధులు నిర్వహించనున్న సిబ్బంది



వేములవాడ చేరుకున్న ఎస్పీఎఫ్ సిబ్బంది

వేములవాడ, జనవరి 2: వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి అధికారులు అదనపు భద్రత కల్పించారు. రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం భద్రత కోసం స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పీఎఫ్) విభాగానికి చెందిన సిబ్బంది భద్రతను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఇద్దరు హెడ్‌కానిస్టేబు ల్స్, పదిమంది పోలీస్ కానిస్టేబుల్‌లతో కలిపి మొత్తం 12 మంది ఎస్పీఎఫ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరిలో మేడారం సమ్మక్క సారలమ్మ జాతర జరగనున్న తరుణంలో కొద్ది వారాలుగా వేములవాడ రాజన్న ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లడానికి ముందు రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకునే ఆనవాయితీలో భాగంగా భక్తులు పెద్దసంఖ్యలో వేములవాడకు వస్తుండడంతో ఆలయానికి అదనపు భద్రత కల్పించాలని కోరుతూ ఆలయ ఈవో డి కృష్ణప్రసాద్ ఉన్నతాధికారులను కోరారు. దీంతో స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ విభాగం నుంచి ఒక ఏఎస్ఐ, ఒక హెడ్ కానిస్టేబుల్, ఎనిమిది మంది కానిస్టేబుల్స్‌ను రాజన్న ఆలయానికి అదనంగా కేటాయించారు. మార్చి 7, 8, 9వ తేదీల్లో జరగనున్న మహాశివరాత్రి జాతర వరకు అదనపు సిబ్బంది భద్రతా విధుల్లో పాల్గొంటారని ఆలయ అధికారులు తెలిపారు. ఇప్పటివరకు ఆలయంలో భద్రతా విధులు నిర్వహిస్తున్న 12 మంది ఎస్పీఎఫ్ సిబ్బందికి మరో పదకొండు మంది అదనంగా వచ్చి చేరడంతో మొత్తం ఎస్పీఎఫ్ భద్రత సిబ్బంది సంఖ్య 23 కు చేరుకుంది. వీరికి అదనంగా 33 మంది హోంగార్డులు కూడా ఆలయ భద్రత విధుల్లో పాల్గొంటున్నారు.

జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



తాళ్ల శృతి



కోనేటి అభినవ్

తిమ్మాపూర్, జనవరి 2: మండలంలోని మొగిళిపాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న తాళ్ల శృతి, కోనేటి అభినవ్ ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. తొర్రూరు జిల్లాలో జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ అండర్ 17పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటి ఈనెల 3 నుంచి 6వ తేది వరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, బిలాస్పూర్‌లో జరగనున్న 67వ జాతీయస్థాయి పోటీల్లో ఇద్దరు విద్యార్థులు పాల్గొంటున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహారెడ్డి, పీఈటీ ఆడెపు శ్రీనివాస్ తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను సర్పంచ్ సుస్మితారెడ్డి, ఎంపీటీసీ తిలక్ ప్రియా రెడ్డి, గ్రామ పెద్దలు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

రూ.6,800 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జనవరి 2: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 6,800 రూపాయలు పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు 70మంది రైతులు 669 క్వింటాళ్ల విడి పత్తి, ఆరుగురు రైతులు గోనె సంచుల్లో ఏడు క్వింటాళ్ల విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 6,800 రూపాయలు, కనిష్ఠ ధర 5,400 రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్, జనవరి 2: స్థానిక ఎస్‌బీఐ ఆర్‌సెటి గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలో జనరల్ ఈడీపీ(వ్యాపార నైపుణ్యాభివృద్ధి)లో ఈ నెల 8 నుంచి ఉచిత శిక్షణ ప్రారంభం కానున్నట్లు సంస్థ డైరెక్టర్ సంపత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత శిక్షణకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన 18-45 సంవత్సరాలు గల గ్రామీణ పురుషులు దరఖాస్తు చేసుకోవాలని పూర్తి వివరాలకు 9949448197, 9849411002 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పోలీసులతో దురుసుగా ప్రవర్తించిన వారిపై కేసు

తిమ్మాపూర్, జనవరి 2: డిసెంబరు 31న రాత్రి విధులు నిర్వహిస్తున్న పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన నాలుగురిపై ఎల్‌ఎండి పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కి తరలించారు. ఎల్‌ఎండి ఎస్సై చేరాలు తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్ కార్పోరేషన్ పరిధిలోని 8వ డివిజన్ అలుగునూర్‌లో డిసెంబరు 31 రాత్రి నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటలను చోటు చేసుకోకుండా ఎల్‌ఎండి పోలీసులు, క్విక్ రెస్పాన్స్‌టీ(క్యూఆర్‌సి) పోలీసులు విధులు నిర్వర్తిస్తుండగా అలుగునూర్‌కి చెందిన కొందరు టాపాసులు పెల్చుతు, కేక్ కట్ చేస్తుండగా దాన్ని పోలీసులు అడ్డుకునేందకు ప్రయాత్నం చేసి టాపాసులు పేల్చవద్దని ఆదేశించారు. అయిన వారు వినకుండా విధుల్లో ఉన్న పోలీసులపై దురుసుగా ప్రవర్తిస్తు, దుర్బషాలాడారు. దీంతో అలుగునూర్‌కి చెందిన గోపు మల్లారెడ్డి, బైరీ రాజు, బుర్ర లక్ష్మణ్, రమేష్ నలుగురిపై సెక్షన్ 294, 353 కింద సోమవారం కేసులు నమోదు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చేరాలు తెలిపారు.

వృద్ధుడి మృతదేహం లభ్యం

శంకరపట్నం, జనవరి 2: శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామంలో ఇటీవల ఓ వృద్ధుడు తప్పిపోయి శవంగా లభ్యమైన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గత సంవత్సరం డిసెంబరు 15న మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిన బండారి భూమయ్య (80) అనే వృద్ధుడు కనిపించకుండా పోయాడు. దీంతో మృతుడి కూతురు బాడిష సుజాత గత నెల 18న కేశవపట్నం పోలీస్ స్టేషన్లో తన తండ్రి భూమయ్య కనబడడం లేదని ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. నూతన సంవత్సరం నాడు కరీంపేట గ్రామంలో వృద్ధుడి శవం వ్యవసాయ భూమి పొదల పక్కన పడి ఉందని సమాచారం వచ్చింది. దీంతో మృతుడి కూతురు వెళ్లి చూడగా తన తండ్రిదేనని గుర్తించింది. తన తండ్రి మతిస్థిమితం లేక తిరుగుతూ కరీంపేట గ్రామ శివారులోని ఓ కౌలు రైతు పొలంలో పడిపోయి మృతి చెందాడని, ఎవరిపై అనుమానం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బిర్యాని సెంటర్‌పై దాడి కేసులో ఐదుగురి రిమాండ్

జమ్మికుంట, జనవరి 2: జమ్మికుంట పట్టణంలోని ఓ బిర్యాని సెంటర్‌పై దాడి చేసి, ఫర్నీచర్ ధ్వంసం చేసిన సంఘటనలో ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి, సీఐ బర్పటి రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 31న బిర్యాని సెంటర్‌కు వచ్చిన ఐదుగురు యువకులు, సిబ్బంది మధ్య జరిగిన వాగ్వాదం జరగగా యువకుడు ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. హోటల్ నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పి అరవింద్, జి రాజు, పి హరీష్, పి సాగర్, పి అనిల్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. వారిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

కెమెరా దొంగిలించిన వ్యక్తి అరెస్టు

కరీంనగర్ క్రైం, జనవరి 2: కలెక్టరేట్ ఎదుట నాలుగు రోజుల క్రితం ఒక కెమెరామెన్ బ్యాగ్ చోరీకి గురి కాగా పోలీసులు మంగళవారం నిందితుడిని పట్టుకుని వీడియో కెమెరాతో పాటు అందులోని పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు కరీంనగర్ ఏసీపీ జి నరేందర్ విలేకరుల సమావేశంలో తెలిపారు. కట్టరాంపూర్‌కు చెందిన జునుగారి శంకర్ కూలి పనిచేస్తూ తాగుడుకు బానిసగా మారాడని, మద్యం కోసం డబ్బులు లేక డిసెంబరు 30న కలెక్టరేట్ ఎదుట బైక్‌పై కనబడిన కెమెరా బ్యాగును ఎత్తుకెళ్లాడని ఏసీపీ తెలిపారు. ఈ మేరకు బాధితుడు ఫిర్యాదు చేయగా నిందితుడి కోసం గాలిస్తుండగా మంగళవారం అంబేద్కర్ స్టేడియం వద్ద శంకర్ అనుమానాస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకుని విచారించగా బ్యాగును ఎత్తుకెళ్లిన నేరం ఒప్పుకున్నాడని తెలిపారు. నిందితుడు గతంలో ఏడు నేర ఘటనలకు పాల్పడినట్లు ఏసీపీ తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు పంపినట్లు ఆయన తెలిపారు.

కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తు చేయించాలి

- జనవరి చివరిలోగా రోడ్ల మరమ్మతులు - ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి



దెబ్బతిన్న కల్వర్టును పరిశీలిస్తున్న జీవన్‌రెడ్డి

రాయికల్, జనవరి 2: ప్రజాపాలన కార్యక్రమానికి వచ్చిన ప్రజల నుంచి కొత్తగా రేషన్‌కార్డులు కావాలనుకున్నవారి నుంచి దరఖాస్తులు చేయించాలని ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి అన్నారు. రాయికల్ మండలంలోని బోర్నపెల్లి, భూపతిపూర్, వీరాపూర్ తదితర గ్రామాల్లో ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి మంగళవారం పర్యటించారు. భూపతిపూర్ గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొని అప్లికేషన్ పత్రంపై ప్రజలకు అవగాహన కల్పించారు. బోర్నపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ ఎత్తిపోతల పంపులను పరిశీలించి త్వరలోనే శుద్ధి నీరు అందజేస్తామని తెలిపారు. బోర్నపల్లి గ్రామంలో ఇటీవల ఇల్లు కాలిపోయిన భారతపు లక్ష్మీనర్సయ్య కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందించడంతో పాటు అధికారులతో మాట్లాడి ప్రభుత్వం నుంచి వచ్చే సహాయాన్ని అందించాలని సూచించారు. రామాజీపేట నుంచి వీరాపూర్, వీరాపూర్ నుంచి రాయికల్ ఎక్స్ రోడ్డులో కల్వర్టు చెడిపోవడంతో మరమ్మతులు చేపట్టకపోవడంతో వీరాపూర్, రామాజీపేట గ్రామస్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని, రెన్యూవల్ బ్రిడ్జి మంజూరై టెండర్ కూడా పూర్తయినట్లు తెలిపారు. సాధ్యమైనంత త్వరలో కొత్త వంతెన నిర్మాణం చేపట్టి భవిష్యత్‌లో ఎప్పుడూ ఎలాంటి ఆటంకాలు రాకుండా చూస్తామన్నారు. గత వర్షాకాలంలో భారీ వర్షానికి రోడ్డు కోతకు గురై ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్న దృష్ట్యా సమస్యను జీవన్‌రెడ్డి దృష్టికి తీసుకురాగా రోడ్లను పరిశీలించిన ఎమ్మెల్సీ తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వీరాపూర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు సోమ వెంకటేష్, సుందరగిరి గంగాధర్, దుంపల నర్సారెడ్డి, భూపతిపూర్ సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్, జక్కుల సాగర్ విష్ణు, శేఖర్ రెడ్డి, నాగరాజు, రాజు, సంతోష్, నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ కాలువకు నీటి విడుదల తగ్గింపు

జగిత్యాల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత యాసంగి సీజన్‌లో ఎస్‌ఆర్‌ఎస్‌పీ నుంచి కాకతీయ కాలువ ద్వారా సరఫరా చేస్తున్న నీటి విడుదలను మంగళవారం అధికారులు తగ్గించారు. ఇప్పటివరకు 6 వేల క్యూసెక్కుల నీటిని కాలువకు విడుదల చేస్తున్నారు. కొద్ది కొద్దిగా 3,500 క్యూసెక్కులకు తగ్గిస్తున్నారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టు సామర్థ్యం 90.3 టీఎంసీలు కాగా ప్రస్తుతం డ్యామ్‌లో 70.67 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి డ్యామ్‌లో 79.621 టీఎంసీల నీరు ఉంది.

ప్రాజెక్టు నుంచి 7,983 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఇందులో కాకతీయ కాలువకు ఆరు వేల క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కులు, అలీసాగర్ ఎత్తిపోతల పథకానికి 472 క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 500 క్యూసెక్కులు, మిషన్ భగీరథ పథకాలకు 152 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గత యేడాది జూన్ ఒకటవ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 200.682 టీఎంసీల నీరు రాగా, 150.917 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు.

కిరాణా షాపు దగ్ధం

మల్లాపూర్, జనవరి 2: షార్ట్ సర్క్యూట్‌తో మండల కేంద్రంలోని కస్తూరి సంతోష్‌కుమార్‌కు చెందిన కిరాణా షాపు దగ్ధమైంది. మంగళవారం కిరాణం షాపులో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగడంతో స్థానికుల సహాయంతో మంటలను ఆర్పీ వేశారు. అప్పటికే షాపులోని వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంతో రూ. 3లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు సంతోష్ తెలిపారు. ప్రభుత్వం సహాయం అందించాలని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్థులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మారుతి(ఫైల్)

రాయికల్, జనవరి 2: మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన దాసరి మారుతి (24) ద్విచక్ర వాహనం అదుపు తప్పి రోడ్డు కింద పడి మరణించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మారుతి తన స్నేహితుడు సింగం నరేష్‌తో కలిసి మంగళవారం ఉదయం 3 గంటల ప్రాంతంలో మైతాపూర్ నుంచి అల్లీపూర్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో రాయికల్ తహసీల్దార్ కార్యాలయం మూల మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి దగ్గరలోని ఇంటికి గల షట్టర్స్‌ను ఢీకొట్టి కింద పడ్డారు. దీంతో మారుతి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. వెనకాల కూర్చున్న నరేష్‌కు గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. మారుతి తండ్రి రాజరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అజయ్ తెలిపారు.

● బైక్ అదుపు తప్పి మరో యువకుడు..



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కథలాపూర్: నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొని తన స్నేహితున్ని పక్కన గ్రామంలో దించి కోరుట్లకు వెళ్తున్న యువకుడు బైక్ అదుపు తప్పి మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బీమారం మండలం పసునూరుకు చెందిన జెజ్జంకి అభిలాష్ (21) గత నెల 31న స్నేహితులతో కలిసి కొత్త సంవత్సర వేడుకలు జరుపుకున్నాడు. పక్కనే ఉన్న రాజలింగంపేటలో తన స్నేహితున్ని దించి పనిమీద కోరుట్లకు బయలు దేరాడు. టీఎస్ 02 ఈపీ 1941 నంబర్ గల బైక్‌పై వెళ్తున్న క్రమంలో మండలంలోని గంబీర్‌పూర్ శివారులో అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న గోతిలో పడ్డాడు. గోతిలో నీళ్లు ఉండడంతో మునిగి చనిపోయాడు. రెండు రోజుల నుంచి ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో అభిలాష్ జాడ కుటుంబ సభ్యులకు తెలియలేదు. మంగళవారం అటువైపు వెళ్తున్న రైతులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై పబ్బ కిరణ్‌కుమార్ పరిశీలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య

కరీంనగర్, రాజన్నసిరిసిల్ల జిల్లాలో వేర్వేరు చోట్ల ముగ్గురు మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డారు.



ఇబ్రహీం మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ మహేష్

గంభీరావుపేట, జనవరి 2: గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన ఎండీ ఇబ్రహీం (55) అనే వ్యక్తి నమాజ్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, బంధువుల వివరాల ప్రకారం.. ఇబ్రహీం గేదెల వ్యాపారం చేసుకుంటూ జీవించేవాడు. నాలుగేళ్ల కిందట పక్షవాతం వచ్చి అనారోగ్యానికి గురయ్యాడు. కర్ర సాయంతో జీవనం సాగిస్తువచ్చాడు. ఆరోగ్యం సహకరించక పోవడం, ఎవ రూ పట్టించుకోక పోవడంతో మానసికంగా కుంగిపోయేవాడు. ఇటీవల, పిల్లలతో సహా భార్య పుట్టింటికి వెళ్లింది. దీంతో ఇబ్రహీం మరింత మానసిక వేదనకు లోనయ్యాడు. బీడీలు తెచ్చుకుంటానని చెప్పి సోమవారం సాయంత్రం ఇంట్లో నుం చి వెళ్లాడు. రాత్రి వరకు ఇంటికి తిరిగి రాక పోవడంతో బంధువులు వెతికారు. మంగళవారం గ్రామ సమీపంలోని నమాజ్ చెరువులో శవమై తేలాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

సిరిసిల్ల క్రైం: సిరిసిల్ల పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన ఒడ్నాల పరమేశ్వర్ (53) అనే చిరువ్యాపారి మంగళవారం కొత్త చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్ వివరాల ప్రకారం... రాజీవ్‌నగర్‌కు చెందిన పరమేశ్వర్ దుస్తులు విక్రయిస్తూ జీవనం సాగించేవాడు. మూడేళ్ల క్రితం అతడి కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. దీంతో మానసికంగా ఆందోళనకు గురయ్యాడు. తాగుడుకు బానిసై వ్యాపారం తగ్గించాడు. మరోవైపు రూ. 2లక్షల అప్పులు అయ్యాయి. వివాహం చేయాల్సిన కూతురు ఉంది. జీవనోపాధికి సిరిసిల్లలోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద పరమేశ్వర్ ఇటీవల చాయ్ హోటల్ ఏర్పాటు చేశాడు. సక్రమంగా నడవకపోవడంతో మనస్తాపం చెందాడు. మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయల్దేరి కొత్త చెరువు వద్దకు వెళ్లాడు. అక్కడే ఉన్న వాచ్‌మెన్ ఫోన్ తీసుకొని భార్య కృష్ణవేణికి కాల్ చేశాడు. తాను చెరువులో దూకి చనిపోతున్నాని, కాపాడుకోమని పెట్టేశాడు. అక్కడే ఉన్న వాచ్‌మెన్ అతడిని వారించినా వినిపించుకోకుండా చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. వెంటనే పరమేశ్వర్ భార్యకు ఫోన్ చేసి వాచ్‌మెన్ విషయం చెప్పాడు. తనకు ఈత రాదని వాచ్‌మెన్ పేర్కొన్నాడు. ఈ మేరకు కుటుంబసభ్యులు చెరువు వద్దకు వెళ్లి చూడగా పరమేశ్వర్ చెరువులో శవమై కనిపించాడు. కృష్ణవేణి ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కరీంనగర్ క్రైం: కరీంనగర్ ముకరంపురకు చెందిన ఎం. వాసంతిశెట్టి(61) అనే వృద్ధురాలు ఒంటికి నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకుంది. రెండో ఠాణా సీఐ వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని ఒక హోటల్ యజమాని భార్య అయిన వాసంతి కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతోంది. ఆమె మానసిక పరిస్థితి సరిగాలేక ఆత్మహత్యకు పాల్పడింది. మంగళవారం ఉదయం 11గంటల ప్రాంతంలో వాసంతి తన ఇంటిలోని వంట గదిలోకి వెళ్లి చీరకు నిప్పంటించుకుంది. ఇంట్లో నుంచి పొగ రావడం గమనించిన ఆమె కుటుంబ సభ్యులు, వర్కర్లు బలవంతంగా తలుపులు తెరిచి ఆమెను ఒక ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. రెండేళ్ల కిందట వాసంతిపై గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి వెళ్లి దాడి చేశాడని కేసు నమోదు కాగా పోలీసుల విచారణలో ఎవరు దాడి చేయలేదని వెల్లడైంది. తాజాగా ఆమె ఆత్మహత్యకు పాల్పడడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై లోతుగా విచారణ జరుపుతున్నామని, పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత మరణానికి కారణం తెలుస్తుందని సీఐ తెలిపారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

కోల్‌సిటీ, జనవరి 2: గోదావరిఖని సప్తగిరికాలనీలో జరిగిన వంచర్ల గంగాధర్‌రావు హత్య కేసులో నిందితుడు చోడ రవితేజ(30)ని మంగళవారం అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌రావు పేర్కొన్నారు. గత నెల 31వ తేది రాత్రి చోడ రవితేజ, గంగాధర్‌రావులు గొడవపడ్డారని, డబ్బుల విషయంలో తిట్టుకున్నారన్నారు. రవితేజ వద్ద గంగాధర్‌రావు కూలీగా పని చేస్తున్నాడని, తరచూ డబ్బులు అడుగుతున్నాడనే కోపంతో అతన్ని తలపై కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడన్నారు. తీవ్ర రక్తస్రావంతో రవితేజ మరణించాడన్నారు. మృతుడి స్వగ్రామం ఆంధ్రప్రదేశ్ పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం అని తెలిపారు.

మద్యం సీజ్

కరీంనగర్ క్రైం, జనవరి 2: రాంనగర్‌లోని అప్నా వైన్ షాపు పక్కన పర్మిట్‌రూంలో ఎలాంటి అనుమతి లేకుండా అధిక ధరకు మద్యం విక్రయి స్తున్నారని రెండో ఠాణా పోలీసులు తనిఖీలు చేసి 6,130 రూపాయల విలువైన మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. మంగళవారం ఉదయం 5:40 గంటలకు అందిన సమాచారం మేరకు పర్మిట్ రూం వద్ద తనిఖీ చేయగా పర్మిట్ రూం నిర్వాహకులు వల్లకొండ బాపురెడ్డి, భోగ రాజేందర్‌లు అధిక ధరకు మద్యం విక్రయిస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పర్మిట్ రూం నిర్వాహకులు ఇద్దరిపై ఎక్సైజ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

శోకసంద్రమైన జగ్గరావుపల్లి

- స్వగ్రామానికి చేరుకున్న సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ చాడ శివకృష్ణారెడ్డి మృతదేహం

బోయినపల్లి, జనవరి 2: మండలంలోని జగ్గరావుపల్లికి చెందిన సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ చాడ శివకృష్ణారెడ్డి (23) మృతదేహం మంగళవారం స్వగ్రామానికి చేరుకోగా సీఐఎస్ఎఫ్ అధికారులు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. శివకృష్ణారెడ్డి రాజస్థాన్‌లోని డీపీలిలో 6వ బెటాలియన్‌లో డాక్యుమెంటరీ సెక్యూరిటీగా విధులు నిర్వర్తిస్తున్నాడు. గత నెల 16న ప్రమాదవశాత్తు కింద పడడంతో కోమాలోకి వెళ్లాడు. అప్పటినుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శివకృష్ణారెడ్డి సోమవారం మృతి చెందాడు. మృతదేహాన్ని సీఐఎస్ఎఫ్ అధికారులు స్వగ్రామానికి తీసుకొస్తుండగా మార్గమధ్యమైన కొదురుపాక నుంచి యువకులు బైక్ ర్యాలీతో జగ్గారావుపల్లికి తీసుకోవచ్చారు. తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు, బంధువులు మృతదేహంపై పడి బోరున విలపించారు. పార్థివదేహాన్ని చూడడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శివకృష్ణారెడ్డి అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోశారు. జైపూర్ నుంచి పార్థివ దేహంతో వచ్చిన సీఐఎస్ఎఫ్ అధికారులు మృతుడి యూనిఫామ్‌ను, జాతీయ జెండాను తల్లిదండ్రులకు అప్పగించి అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. తహసీల్దార్ పుష్పలత, కాంగ్రెస్ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కూస రవీందర్ నివాళులర్పించారు.



పాడె మోస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

పెద్దమ్మ ఆలయంలో కాత్యాయనిదేవి వ్రతాలు

మెట్‌పల్లి, జనవరి 2: పట్టణంలోని పెద్దమ్మ ఆలయంలో కాత్యాయదేవి సామూహిక వ్రతాలను ఘనంగా భక్తులు చేపట్టారు. మార్గశిర ధనుర్మాసం మంగళవారం సందర్భంగా పెద్దమ్మ ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి, కాత్యాయనిదేవి వ్రతాలు, కుంకుమ పూజలు ఆలయ పురోహితుడు మదన్‌శర్మ అంగరంగ వైభవంగా జరిపించారు. ఉదయం నుంచి ఆలయంలో అమ్మవారికి, శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేకం జరిపి లోక కళ్యాణార్థం ప్రత్యేక పూజలు జరిపారు. ఆయలంలో సామూహిక వ్రతాలు, కుంకుమ పూజలను భక్తులచే జరిపించారు. నియోజక వర్గంలోని పలు గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దత్తత్రేయుని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపి, ఐశ్వర్యలక్ష్మి గోశాలలోని ఆవులకు ఆహారం అందజేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

సీసీఐకి విక్రయించే రైతులు సమాచారం ఇవ్వాలి

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

జమ్మికుంట, జనవరి 2: కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ)కి పత్తి విక్రయించే రైతులు మార్కెట్ అధికారులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారిణి పద్మావతి అన్నారు. మంగళవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించారు. 'పత్తి అమ్మకానికి ఆన్‌లైన్ చిక్కులు' అనే కథనం సోమవారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురితం కావడంతో స్పందించారు. ఈ సందర్భంగా జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారిణి మాట్లాడుతూ రైతులు ఎంత పత్తి అమ్మకానికి తీసుకు వస్తున్నారు, భూమి ఎంత ఉంది, ఆన్‌లైన్‌లో నమోదైన విస్తీర్ణం ఎంత, పత్తి ఎన్ని క్వింటాళ్లు అమ్ముకోవచ్చనే వివరాలను మార్కెట్ అధికారులు వెల్లడిస్తారన్నారు. పత్తి తీసుకు వచ్చిన తర్వాత ఆన్‌లైన్‌లో భూమి నమోదై లేకుంటే సీసీఐ కొనుగోలు చేయదని తెలిపారు. రైతులు ఎప్పుడు ఫోన్ చేసినా మార్కెట్ అధికారులు వివరాలు వెల్లడించేందుకు సిద్ధంగా ఉంటారని, రైతులు సహకరించాలని కోరారు. అధికారులు, సిబ్బంది ఉన్నారు.

అయ్యప్ప మహా పడిపూజ

కరీంనగర్ కల్చరల్, జనవరి 2: మాజీ ఎంపీ, రాష్ట్ర ప్రణాళికాసంఘం మాజీ ఉపాధ్యక్షుడు బి వినోద్‌కుమార్-డాక్టర్ మాధవి దంపతుల సౌజన్యంతో తెలంగాణ అయ్యప్ప సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీఎస్ ఆనంద్ గురుస్వామి ఆధ్వర్యంలో మంగళవారం జెడ్‌పి క్వార్టర్స్‌లోని అయ్యప్ప దేవాలయంలో 108 మంది కన్నె స్వాములతో మహాపడిపూజ ఘనంగా నిర్వహించారు. అంతకుముందు స్వామికి విశేష అభిషేకం, అర్చన చేశారు. కాగడాలతో ప్రదర్శన, పల్లకీసేవ నేత్రపర్వంగా జరిపారు. రాత్రి అల్పాహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బొల్లు నరేందర్, లింగంపల్లి సత్యనారాయణ, మంద వెంకన్న, పల్లె నారాయణగౌడ్, దిలీప్, మురళి, గంగాధర్, రాజేశ్వర్‌రావు, రవీందర్‌రావు, రాచకొండ తిరుపతిగౌడ్, జయపాల్, సుధాకర్, వేంకటస్వామి, ఈఓ కొన్న కాంతారెడ్డి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అపోలో రీచ్‌లో అరుదైన శస్త్ర చికిత్స

సుభాష్‌నగర్, జనవరి 2: నగరంలోని అపోలో రీచ్‌ఆసుపత్రిలో వైద్యులు అరుదైన శస్త్ర చికిత్సను నిర్వహించారు. మల్యాల మండలానికి చెందిన పోచంపల్లి రాజమల్లయ్య (68) చాతిలో నొప్పితో అపోలో రీచ్ ఆసుపత్రిలో చేరారు. కార్డియో తురాసిక్ వాస్కులర్ సర్జన్ డాక్టర్ సంతోష్ దంగేటి వైద్యపరీక్షలు నిర్వహించారు. గుండెలోని ప్రధాన రక్తనాళాలు మూసుకుపోవడంతో పిటిసిఏ, స్టెంటింగ్ ద్వారా ఫలితాలు అంతా ఆశాజనకంగా ఉండవన్నారు. దీంతో డాక్టర్ సంతోష్ దంగేటి మిక్స్ (మినిమల్ ఇన్వాసివ్ కార్డియోతురాసిక్ సర్జరీ) చాతిపై చిన్నపాటి కోతతో డిసెంబరు28న శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించగా మంగళవారం డిశ్చార్జ్ చేశారు. ఈసందర్భంగా సిటివిఎస్ అండ్ మిక్స్ సర్జన్ డాక్టర్ సంతోష్ మాట్లాడుతూ మిక్స్ టెక్నిక్ ద్వారా సిఏబిజి సర్జరీని కరీంనగర్‌లోని అపోలో రీచ్ ఆసుపత్రిలో అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు.

కార్మికుల హక్కులను పరిరక్షించాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, డిసెంబరు 2: నగరంలోని ఇందిరాభవన్‌లో ఎస్‌డబ్ల్యుయు ఐఎన్‌టీయూసీ రీజనల్ స్థాయి విస్తృత స్థాయి సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలపై చర్చించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కోల్పోయిన హక్కుల గురించి 2017, 2021 పేస్కేల్స్, 2013 పే స్కేల్ ఏరియర్స్ ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ఎస్‌డబ్ల్యూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ మహమ్మద్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ, ఎస్‌డబ్ల్యు రీజనల్ గౌరవాధ్యక్షులుగా కోమటిరెడ్డి నరేందర్ రెడ్డిని, రీజనల్ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్‌కే రాజు, టీఆర్ రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం 150 మంది కార్మికులు ఐఎన్‌టీయూసీ-ఎస్‌డబ్ల్యుయులో చేరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైస్ చైర్మన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ జక్కుల మల్లేష్‌గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె రాజిరెడ్డి, రాష్ట్ర నాయకులు బెన్ సుశీల్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ అబ్రహం, సుభాష్, గోపాల్‌లు పాల్గొన్నారు.

ఎస్‌ఈకి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ఉద్యోగులు

గణేశ్‌నగర్, జనవరి 2: టీఎస్ ఎన్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో ఎస్‌ఈ వడ్లకొండ గంగాధర్‌ను విద్యుత్ ఉద్యోగులు వివిధ సంఘాల నాయకులు మంగళవారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ, వడ్లకొండ గంగాధర్ మాట్లాడుతూ ప్రతి విద్యుత్తు ఉద్యోగి అంకితభావంతో పనిచేయాలని అన్నారు. కార్యక్రమంలో డీఈలు విజేందర్‌రెడ్డి రాజం తిరుపతి కాళిదాసు గోపికృష్ణ చంద్రమౌళి, ఏడీలు, ఎస్ఏఓ రాజేశం,ఏఈలు అన్ని యూనియన్లు అసోసియేషన్ల అధ్యక్ష కార్యదర్శులు నాయకులు, పీఓ, బండారి చంద్రయ్య, మహిళా ఉద్యోగులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

బీఆర్ఎస్ నాయకుల సన్నాహక సమావేశం

కరీంనగర్ టౌన్, జనవరి 2: హైదరాబాద్‌లో గురువారం జరిగే బీఆర్ఎస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని పురస్కరించుకొని మంగళవారం సన్నాహక సమావే శాన్ని నిర్వహించారు. స్థానిక మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంపు కార్యాలయం మీసేవలో జరిగిన ఈ సమావే శంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, జిల్లా గ్రంథాయల సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు జమీలొద్దీన్, ఎంపీపీలు లక్ష్మయ్య పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సుంకిశాల సంపత్‌రావు, రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన వొడితెల ప్రణవ్

హుజూరాబాద్, జనవరి 2: హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని సచివాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. హుజూరాబాద్ నియోజకవర్గంలోని సమస్యలను సీఎం రేవంత్ రెడ్డికి దృష్టికి తీసుకెళ్లినట్లు ప్రణవ్ పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి హుజూరాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.



సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వొడితెల ప్రణవ్

ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి

హుజూరాబాద్, జనవరి 2: రాష్ట్రంలో విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ ఆరోపించారు. మంగళవారం హుజూరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేశారన్నారు. దాదాపుగా ఐదు కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వమైనా విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని కోరారు.

ఎస్సైని కలిసిన నాయకులు

తిమ్మాపూర్, జనవరి 2: మండలంలోని ఎల్ఎండీ ఎస్సైగా బదిలీపై వచ్చిన బెల్లం చేరాలును పలువురు వివిధ పార్టీలకు చెందిన నాయకులు మంగళవారం కలిసి పూల బోకే, శాలుతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సైని కలిసిన వారిలో జుగుండ్ల సర్పంచ్ సాయిల్ల ఎల్లేష్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ రావ రాజు, జిల్లా గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం కార్యదర్శి సురేష్ యాదవ్, తొడెంగ కొమురయ్య పాల్గొన్నారు.

ప్రొటోకాల్ గురించి మాట్లాడటం హాస్యాస్పదం



దరఖాస్తుదారులతో కాంగ్రెస్ నాయకులు

జమ్మికుంట, జనవరి 2: ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ప్రొటోకాల్ గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమాన్ని సమ్మిరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే బెదిరింపులు, బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తే సహించేది లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను త్వరలోనే అమలు చేస్తుందని, ప్రజలకు తమ ప్రభుత్వంపై పూర్తి విశ్వాసం ఉందన్నారు. కార్యక్రమంలో కసుబోజుల వెంకన్న, సుంకరి రమేష్, ఎండీ సలీం, చిన్నింటి నాగేంద్ర, కాగితం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా పాలన'ను సద్వినియోగం చేసుకోవాలి

కరీంనగర్ టౌన్, జనవరి 2: సంక్షేమ పథకాలను పేదలు లబ్ధి పొందేందుకు చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తు స్వీకరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ తెలిపారు. మంగళవారం నగరంలోని ఖాన్‌పురా, అశోక్‌నగర్‌లో ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

●**కరీంనగర్ టౌన్:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు స్వీకరిస్తున్న అభయ హస్తం ఆరు గ్యారంటీలకు ప్రతి ఒక్కరు దరఖాస్తు చేసుకోవాలని మేయర్ సునీల్‌రావు సూచించారు. మంగళవారం 54వ డివిజన్ పరిధిలోని రైతుబజార్ సమీపంలో కార్పొరేటర్ ఇప్రా తహేరీన్ అధీనా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమానికి మేయర్ సునీల్‌రావు హాజరయ్యారు.

●**చొప్పదండి:** ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మంగళవారం చొప్పదండిలో జరిగిన ప్రజాపాలన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. అర్హులైన ప్రతీ ఒక్కరు దరఖాస్తు చేసుకోవాలని, 6వ తేదీ తర్వాత కూడా మండల కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, కమిషనర్ శాంతి కుమార్, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పురం రాజేశం, పట్టణ అధ్యక్షుడు ముద్దం తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.

●**తిమ్మాపూర్:** ప్రజల ఇబ్బందులు తొలగించేం దుకే సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా పాలనను ప్రారంభించారని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని మహాత్మానగర్, మల్లాపూర్, మన్నెంపల్లి గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. కొందరు మహిళలు తమ గ్రామానికి బస్సు సౌకర్యం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతిరెడ్డి వనితదేవేందర్‌రెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ జయశంకర్, తహసీల్దార్ కనకయ్య, ఎంపీడీవో రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.





దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం

●**హుజూరాబాద్:** పట్టణంలోని పలు వార్డుల్లో అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. 30 వార్డుల్లో 7,009 దరఖాస్తులు స్వీకరించినట్లు ప్రత్యేకాధికారి పద్మావతి, కమిషనర్ సమ్మయ్య తెలిపారు.

●**సైదాపూర్:** మండలంలో లస్మన్నపల్లి, నల్లరామయ్యపల్లి, పెర్కపల్లి, రాయికల్ గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించారు.

●**ఇల్లందకుంట:** మండలంలోని నాలుగు గ్రామాల్లో చేపట్టిన ప్రజా పాలనలో దరఖాస్తులు 2714 వచ్చినట్లు ఎంపీడీవో తీగల శంకర్ తెలిపారు. రాచపల్లిలో 847, సిరిసేడులో 840, సీతంపేటలో 567, శ్రీరాములపల్లిలో 470 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు.

●**శంకరపట్నం:** మండలంలోని కల్వల, కాచాపూర్, ఇప్పలపల్లి, గొల్లపల్లి గ్రామాల్లో ప్రజా పాలనలో దరఖాస్తులు స్వీకరించారు. కల్వలలో 133, కాచాపూర్‌లో 527, ఇప్పలపల్లిలో 324, గొల్లపల్లిలో 205 మొత్తం 1189 దరఖాస్తులు స్వీకరించినట్లు ఎంపీడీవో నల్ల శ్రీవాణి తెలిపారు.

●**గన్నేరువరం:** మండలంలోని మైలారం, సాంబయపల్లి, పీచుపల్లి గ్రామాల్లో ఎంపీపీ లింగాల మల్లారెడ్డి, అధికారులతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దారు భిక్షపతి, ఎంపీడీవో స్వాతి పాల్గొన్నారు.

●**గంగాధర:** ప్రజాపాలనలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలకు ప్రజలు దరఖాస్తులు చేసుకోవాలని లక్ష్మీదేవిపల్లి సర్పంచ్ తాళ్ల విజయలక్ష్మి, ఎంపీడీ వో రాజీవ్ మల్హోత్ర అన్నారు. మంగళవారం మండలంలోని లక్ష్మీదేవిపల్లి, కురిక్యాల, కొండన్నపల్లి గ్రామాల్లో ప్రజాపాలనలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్‌బాబు, సర్పంచ్ రేండ్ల జమున, ఎంపీటీసీ అట్ల రాజిరెడ్డి పాల్గొన్నారు.

●**రామడుగు:** రామడుగు మండలంలోని నాలుగు గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభల్లో 1,607 దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మండలంలోని గుండి, కొక్కెరకుంట, కిష్టాపూర్, గోలిరామయ్యపల్లిలో గ్రామసభ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ భాస్కర్, ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎంపీవో రాజశేఖర్ రెడ్డి, ఏపీవో ఏపీఎం ప్రభాకర్, సచిన్ పాల్గొన్నారు.

●**వీణవంక:** మండలంలోని ఇప్పలపల్లి, కనపర్తి ఘన్ముక్ల, హిమ్మత్‌నగర్ గ్రామల్లో ప్రజా పాలన కార్యక్రమము అధికారులు చేపట్టారు. 2,650 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమములో తహసీల్దార్ తిరుమల్ రావు, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో ప్రభాకర్ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు సన్మానం

కరీంనగర్ క్రైం, జనవరి 2: కరీంనగర్ అగ్నిమాపకశాఖలో సేవా పతకాలు అందుకున్న జిల్లా సహాయక అగ్నిమాపక శాఖ అధికారి ప్రభాకర్, లీడింగ్ ఫైర్‌మెన్ అంజనేయులు, మునీంద్రాచారి, డ్రైవర్ రామచందర్‌లను జిల్లా ఫైర్ ఆఫీసర్ టి వెంకన్న, కరీంనగర్ ఫైర్ ఆఫీసర్ పరమేశ్వర్‌లు సన్మానించారు. కరీంనగర్ ఫైర్ స్టేషన్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఉద్యోగులను సన్మానించి అభినందించారు.

గాయత్రి బ్యాంకు సేవలు అభినందనీయం

కరీంనగర్ టౌన్, జనవరి 2: గాయత్రి బ్యాంకు సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. గాయత్రి బ్యాంకు ఖాతాదారుడైన ఊర సంపత్ ప్రమాదవశాత్తు మరణించగా అతని భార్య ఊర దేవకు గాయత్రి నిర్భయ సేవ ఖాతాపై ప్రమాద బీమా లక్ష రూపాయలను మంగళవారం జిల్లా కలెక్టర్ తన చాంబర్‌లో అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖాతాదారులకు కనీస డిపాజిట్‌తోనే ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తూ పేద, మధ్య తరగతి వినియోగదారులకు ప్రమాద బీమా కల్పిస్తూ వారికి అండగా ఉంటుందని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ వి కృష్ణ, సీనియర్ ఆఫీసర్ వి విష్ణుదర్, జూనియర్ ఆఫీసర్ విష్ణుప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన మేయర్

కరీంనగర్ టౌన్, జనవరి 2: నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతిని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన నగరపాలక సంస్థలో చేపడుతున్న వివిధ అభివృద్ధి అంశాలపై ఆయన చర్చించారు. అలాగే మేయర్ సునీల్‌రావును నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, సిబ్బంది కలిసి పూల మొక్కను బహూకరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఖాదిమానె మిల్లత్ స్వచ్ఛంద సంస్థకు అండగా ఉంటాం

కరీంనగర్ అర్బన్, జనవరి 2: ఖాదిమానె మిల్లత్ స్వచ్ఛంద సంస్థకు అండగా ఉంటూ రాష్ట్ర ప్రభుత్వం తరపున తోడ్పాటు నందిస్తామని మానకొండూర్ ఎమ్మెల్యే డీసీసీ అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. రాజీవ్‌చౌక్‌లో అస్లామీ సిటీ సెంటర్ కాంప్లెక్స్‌లోని ఖాదిమానె మిల్లత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన క్యాలండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కరీంనగర్ వేదికగా కుల, మతాలకతీతంగా సేవలందిస్తుండటం అభినంద నీయమన్నారు. ప్రతి సంవత్సరం శీతాకాలంలో సంస్థ కార్యదర్శి సమద్ నవాబ్ తన తల్లి పేరటి స్వతం డబ్బులతో పేదలకు బ్లాంకెట్లు పంపిణీ చేయటం అభినందనీయమన్నారు. పేదలకు వైద్య సేవలు, వితంతువులకు పింఛన్లు, జైలు నుంచి విడుదలకు న్యాయపరమైన సేవలు అందించటం, పేద విద్యార్థులకు, అనాథల అంత్యక్రియలకు సహాయం చేమటం ప్రశంసనీయమన్నారు. కార్యక్ర మంలో కాంగ్రెస్‌పార్టీ కరీంనగర్ నియోజకవర్గ ఇంచార్జి పురుమల్ల శ్రీనివాస్, స్థానిక కార్పొరేటర్ వంగల పవన్‌కుమార్, ఖాదిమానె సంస్థ అధ్యక్షులు మహ్మద్ అంజదుల్లా బేగ్, కార్యదర్శి సమద్‌నవాబ్, కోశాధికారి మక్బుల్ హుస్సేన్, ఉపాధ్యక్షులు సయ్యద్ ఫసియొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలి

కరీంనగర్‌రూరల్, జనవరి2: విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలని హమ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు దనపురి సాగర్ అన్నారు. కరీంనగర్ రూరల్ మండలం మొగ్దుం పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వైజ్ఞానిక కల్పన దినోత్సవంలో భాగంగా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హమ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు దనపురిసాగర్ మాట్లాడుతూ సైన్స్ అనేది సహజ ప్రపంచం గురించి తెలుసుకోవడానికి ఒక మార్గమన్నారు. విద్యార్థులు పరిశోధనలు చేయడం అలవర్చుకోవాలన్నారు. అప్పుడే వారిలో ఉన్న సృజనాత్మకత వెలికి వస్తుందన్నారు. ఈసందర్భంగా వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పద్మ, సంస్థ సభ్యులు జిల్లా రమణ, జి.శ్రీధర్‌రెడ్డి, మునిగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

గడప గడపకు అయోధ్య రాములోరి అక్షింతలు



కనగర్తిలో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



నర్సింగాపూర్‌లో అయోధ్య రాముడి అక్షింతలతో భక్తులు

హుజూరాబాద్, జనవరి 2: హుజూరాబాద్ పట్టణంలో అయోధ్య రాములోరి అక్షింతలను బీజేపీ నాయకులు మంగళవారం గడప గడపకు తిరుగుతూ వితరణ చేశారు. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులతో వారికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు గంగిశెట్టి రాజు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: ఇంటింటికి రాములోరి అక్షింతలు చేరాలని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర సభ్యుడు మట్ట పవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కనగర్తి గ్రామంలోని ఉమామహేశ్వరస్వామి దేవాలయంలో రాములోరి అక్షింతలు, రామమందిరం ఫొటోలు అయోధ్య నుంచి రాగ ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామంలోని వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ఆలయంలో ఈ నెల 15వరకు అక్షింతలు ఇస్తామన్నారు. ప్రతిఒక్కరూ రాములోరి అక్షింతలను తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో అర్చకులు నారాయణ, ఓంకార్, ట్రస్టు సభ్యులు తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, బిక్షపతి, రాకేష్, భాగ్య, మహేందర్, లలిత, రాజు, అంజిరెడ్డి, మల్లేష్, సదానందం, భరత్ పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని తాడికల్ గ్రామంలో అయోధ్య నుంచి రాములోరి అక్షింతలను మంగళవారం ఇంటింటికి తిరుగుతూ వితరణ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గ్రామంలోని ప్రతి ఇంటింటికి తిరుగుతూ రాములోరి అక్షింతలను అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

మానకొండూర్: మండలంలోని కొండపల్కలలో అయోధ్య రామచంద్రస్వామి అక్షింతలు ఇంటింటికి మంగళవారం పంపిణీ చేశారు. గ్రామంలోని రామాలయం నుంచి నిర్వహించిన శోభాయాత్రలో గ్రామస్థులు పాల్గొని ప్రతీ ఇంటికి అక్షింతలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గుర్రాల వెంకటరెడ్డి, మాడ నారాయణరెడ్డి, గడ్డం మార్కండేయ, మాడ తిరుపతిరెడ్డి, రావుల శంకరాచారి, దూలం కిరణ్, అడప రవి, రంగు సంపత్‌గౌడ్, పురోహితులు నమిలికొండ రఘురామాచార్యులు, పాల్గొన్నారు.

తిమ్మాపూర్: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్ శివారులోని మానేరు నగర్ కాలనీలో గల శ్రీరామసాయి పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు, శ్రీరామ చిత్రపటాలు, కరపత్రాలకు వేద పండితులు తిరునగరి చక్రధర స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాలనీలో మహిళలు మంగళహారతులతో డప్పుచప్పుళ్లతో అక్షింతలతో శోభాయాత్రతో ఇంటింటికి తిరుగుతు అయోధ్య రాముడి అక్షింతలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు చిందం నరసయ్య, ట్రస్ట్ సభ్యుడు బొంతల కళ్యాణ్ చంద్ర, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దురిశెట్టి సంపత్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వీణవంక: మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో అయోధ్య రాముని అక్షింతలు ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి తీసుకువచ్చిన అక్షింతలతో ఊరేగింపుగా తీసుకెళ్లి ఇంటింటికి పంపిణీ చేశారు. డప్పుచప్పుల్ల మధ్య మహిళలు కోలాటలతో నృత్యాలు చేస్తు ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమములో సర్పంచ్ గంగాడి సౌజన్యతిరుపతిరెడ్డి, వార్డుసభ్యులు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రహరీ లేక ఇబ్బందులు

ఇల్లందకుంట, జనవరి 2: ఇల్లందకుంట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రహరీ లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నిత్యం ప్రభుత్వ దవఖానాకు వందలాది మంది వైద్యం చేయించుకోవడానికి వస్తుంటారు. ప్రహరీ లేక వానాకాలంలో చెరువులోని నీరు ఆస్పత్రి మెట్ల వరకు వచ్చి ఇబ్బందులు అవుతున్నాయి. పాములు, తేళ్లు ఆస్పత్రిలోపలికి వచ్చిన సందర్భాలు కోకొళ్లలుగా ఉన్నాయి. ప్రహరీ లేకపోవడంతో రక్షణ లేకుండా పోయింది. ఆస్పత్రికి ప్రత్యేక నిధులు కేటాయించడంలో విఫలమయ్యారని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతున్నారు. ప్రహరీ నిర్మాణం కోసం నివేదికను తయారు చేసి జిల్లా ఉన్నతాధికారులకు పంపించామని ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ తులసీదాస్ పేర్కొన్నారు. రోగులకు ఇబ్బందులు కలుగకుండా ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టేందుకు కృషి చేస్తాం.



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా ఏపుగా పెరిగిన చెట్లు

న్యూ ఇయర్ వేడుకల్లో మహిళా ప్రజాప్రతినిధితో ఎమ్మెల్యే డ్యాన్స్

● సోషల్ మీడియాలో వైరల్

కరీంనగర్ క్రైం, జనవరి 2: నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా డిసెంబరు 31న రాత్రి కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో ఒక మహిళా ప్రజాప్రతినిధితో బలవంతంగా ఎమ్మెల్యే నృత్యం చేయించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నది. జిల్లాకు చెందిన ఎమ్మెల్యే ఆ మహిళా ప్రజాప్రతినిధికి బలవంతంగా కేక్ పూయటం, ఆమెతో నృత్యం చేసిన విధానంపై విమర్శలు వస్తున్నాయి. అయితే నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా కేక్‌కట్ చేసి అక్కడున్నవారందరికీ కేక్‌ను ముఖానికి పూసిన సందర్భంలో ఆ ప్రజాప్రతినిధికి కేక్ పూసారని, దీనిపై కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు, ఎమ్మెల్యే అనుచరులు సోషల్ మీడియా వేదికగా సమాధానం ఇస్తూ గతంలో ఎమ్మెల్యేకు సదరు ప్రజాప్రతినిధి రాఖీ కట్టిన ఫొటో పెట్టారు. ఘటనపై ఇంటెలిజెన్స్ అధికారులు కూడా ఆరా తీస్తున్నట్లు సమాచారం.

దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ రూరల్, జనవరి 2: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఐదవ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జెజె థెరిస్సా ఒక ప్రకటనలో తెలిపారు. ఐదవ తరగతి ప్రవేశానికి ఈ నెల 6వ తేదీలోగా ఆన్‌లైన్‌లో 100 రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఉమ్మడి ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11వ తేదీన ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వర కు ఉంటుందన్నారు.

జాతీయస్థాయి డాడ్జ్‌బాల్ పోటీలకు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 2: హర్యానా రాష్ట్రంలోని షాహిద్ మదన్‌లాల్ డింగ్రా స్టేడియంలో ఈ నెల 5, 6, 7 తేదీల్లో జరగనున్న జాతీయస్థాయి డాడ్జ్‌బాల్ పోటీలకు జిల్లా కేంద్రంలోని విద్యానగర్ కోరా జాన్సన్ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. గత నెల 8ఇంక్లైన్ కాలనీలో జరిగిన రాష్ట్ర స్థాయి డాడ్జ్‌బాల్ పోటీల్లో కరీంనగర్ జట్టు తరపున పాల్గొని విశేష ప్రతిభచాటిన పాఠశాల విద్యార్థులు జె కౌశిక్, ఎల్ గీతికలు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను మంగళవారం పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మహిపాల్ రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరికృష్ణ, వంగల సంతోష్‌రెడ్డి, పీఈటీ దుర్గరాజు అభినందించారు.

క్రికెట్ పోటీల్లో సెయింట్‌జార్జ్ విద్యార్థి ప్రతిభ

కరీంనగర్‌రూరల్, జనవరి 2: రాష్ట్రస్థాయి క్రికెట్‌పోటీల్లో సెయింట్ జార్జ్ (సిబిఎస్ఈ) విద్యార్థి సాయివర్షిని అత్యున్నత ప్రతిభ కనబరిచారు. డిసెంబరు 23న నగరం రాంనగర్‌లోని లిటిల్‌పార్క్ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్ 17 బాలికల క్రికెట్ పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. డిసెంబరు 25న భద్రాద్రి జిల్లా కొత్తగూడెంలో జరిగిన పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థిని పాఠశాల చైర్మన్ డాక్టర్ పి ఫాతిమారెడ్డి అభినందించారు. క్రికెట్ కోచ్ సాయినాథ్, విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పొదుపు సంఘం కమిటీ ఎన్నిక

గణేశ్‌నగర్, జనవరి2: పొదుపు సంఘం నూతన కమిటీ అధ్యక్షులుగా సమ్మెట శ్రీనివాస్ నాయి, ప్రదాన కార్యదర్శిగా కొత్తగట్టు రమేష్ నాయిాలు ఎన్నికైనట్లు తెలిపారు. మంగళవారం కరీంనగర్ బోయవాడ పొదుపు సంఘం ఎన్నికలు అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించారు. ఎన్నికల కమిటీ మెంబర్లుగా నగర గౌరవ అధ్యక్షులు చౌదర్తి లక్ష్మణ్‌కుమార్ నాయీ, నగర అధ్యక్షులు జంపాల సంపత్ నాయీ, జిల్లా ఉపాధ్యక్షులు నాగవేల్లి రాజేష్ నాయీ, జనగామ కూమర్ నాయీ సమక్షంలో పదుపు చిట్టి ఎన్నికలు నిర్వహించారు.

రాష్ట్ర సంచాలకుడిని కలిసిన నాయకులు

సుభాష్‌నగర్, జనవరి 2: హైదరాబాద్‌లోని అబిడ్స్‌లో రాష్ట్ర సంచాలకులు మార్తినేని వెంకటేశ్వర్‌రావును టీఎస్‌జీఓ నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పోరిక రాము, స్టేట్ ఆడిట్ డైరెక్టర్‌లను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా డిప్యూటి డైరెక్టర్ స్టేట్ ఆడిట్‌రాజ్‌కుమార్, టీఎస్‌జీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, సహాయ ఆడిట్ అధికారి సిహెచ్ జోయల్ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

గంగాధర, జనవరి 2: గంగాధర ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు మడ్లపల్లి గంగాధర్, సర్పంచ్ రేండ్ల జమున నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు కొత్త సంవత్సరం శుభాకాంక్షలు తెలపడానికి బొకేలు, శాలువాలు తీసుకురాకుండా విద్యార్థులకు చేయూతనివ్వడానికి నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా మంగళవారం గంగాధర ప్రభుత్వ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు, కస్తూర్బాగాంధీ విద్యార్థులకు నోట్ బుక్స్ అందించారు.

విద్యార్థినికి అభినందనలు

హుజూరాబాద్, జనవరి 2: హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న శనిగరపు వైష్ణవి జాతీయ హాకీ క్రీడల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చిందని కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరాదేవి మంగళవారం తెలిపారు. ఒరిస్సాలో జరిగిన హాకీ ఇండియా జూనియర్స్ ఉమెన్స్ నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో వైష్ణవి పాల్గొందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు వైష్ణవిని అభినందించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ లక్ష్మీనర్సింహమూర్తి, దినకర్, శ్రీనివాస్, మధు, రమేష్, ఉదయశ్రీ, పరమేష్, చారి పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

భగత్‌నగర్, జనవరి 2: నగరంలోని దేవుళ్లపురి బ్రహ్మంగారి దేవాలయం ఆవరణలో కరీంనగర్ విశ్వబ్రాహ్మణ ఫార్మా ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కట్టప్రవీణ్‌కుమార్, ప్రధానకార్యదర్శి వంగల నవీన్, కోశాధికారి కోటగిరి శ్రీనివాస్, కార్యవర్గసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి శస్త్రచికిత్స

కరీంనగర్ రూరల్, జనవరి 2: లయన్ చింతల కిషన్ పటేల్ చైర్‌పర్సన్ హంగర్ రిలీఫ్ లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్320 జి ఆధ్వర్యంలో రేకుర్తి కంటి ఆసుపత్రిలో ఉచిత కంటి శస్త్ర చికిత్స నిర్వహించారు. గంగిపల్లి శంకరయ్యకు ఉచితంగా కంటి శస్త్ర చికిత్సను నిర్వహించారు. రేకుర్తి కంటి ఆసుపత్రి వైస్ చైర్మన్ చిదుర సురేష్, ట్రస్ట్ బోర్డు మెంబర్ కొల అన్నారెడ్డి సహకారంతో కంటి శస్త్ర చికిత్స నిర్వహించారు.

పాడి గోవును సంహరించిన దుండగులు

శంకరపట్నం, జనవరి 2: మండలంలోని మొలంగూర్ గ్రామంలో పాడి గోవును అపహరించి సంహరించిన ఘటన చోటు చేసుకుంది. మొలంగూర్ గ్రామానికి చెందిన గాజుల పద్మ-కుమారస్వామి కుటుంబ సభ్యులు పాడి గోవును పెంచుకుంటున్నారు. సోమవారం అర్ధరాత్రి కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఆ గోవును అపహరించారు. గ్రామ చివర నిర్మానుష్యా ప్రాంతానికి తీసుకెళ్లి దానిని సంహరించారు. గోవుకు చెందిన కాలును ఓ కుక్క తీసుకువచ్చి గాజుల పద్మ-కుమారస్వామి నివసిస్తున్న పరిసరాలలో వేసినట్లు తెలిపారు. అది చూసిన కుటుంబ సభ్యులు ఆ కాలు వారి పాడి గోవుదని నిర్ధారించుకొని కన్నీరుమున్నీరుగా విలపించారు. అనుమానితులపై కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.